క్లుప్తంగా

తరల్ అమలు తీరు పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న సురేష్ నాని

కంబాలచెరువు: టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ (తరల్) కార్యక్రమం విద్యార్థులను ఉత్సాహంగా నేర్చుకునేలా చేస్తుందని జిల్లా పరిశీలకులు జి.సురేష్ నాని అన్నారు. స్థానిక రామదాసుపేట నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. తరల్ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు విద్యార్థుల స్థాయిని బట్టి బోధనాభ్యసన కృత్యాలు చేయిస్తారన్నారు. వాటిని విద్యార్థులు ఆసక్తికరంగా నేర్చుకుంటారన్నారు. తరల్ అమలు తీరును పరిశీలించారు. విద్యార్థుల గ్రేడింగ్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ రికార్డులు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో 11 కేవీ పొట్టిలంక ఫీడర్‌పై శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ శ్రీధర్‌వర్మ తెలిపారు. కడియం మండలం వీరవరం గ్రామానికి సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

కడియం: ఇంగ్లిష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని ఉపాధ్యాయురాలు బి.సువర్ణవేణి అన్నారు. స్థానిక హైస్కూల్లో గురువారం ఇంగ్లిష్ భాషా దినోత్సవం నిర్వహించారు. స్కూలు ఉపాధ్యాయుడు టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సువర్ణవేణి మాట్లాడుతూ లెర్న్‌వర్స్, టోఫెల్ తదితర కొత్త విధానం ద్వారా ఇంగ్లిష్ భాషపై అభిరుచి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయుడు రాజు మాట్లాడుతూ ఆంగ్ల భాష నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అన్నసమారాధన

కడియం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని దుళ్ల గ్రామంలో గురువారం గ్రామస్తులు, భక్తుల సహకారంతో భారీ అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తూకాలపై అవగాహన

ప్రకాశం నగర్: తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నటరాజ్ సెంటర్ రైతు బజారులో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అక్కడి ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీ చేశారు. ప్రజలు కొనుగోలు చేసిన కూరగాయలను తూకం వేసి పరీక్షించారు. పలువురు వినియోగదారుల అనుమానాలను అసిస్టెంట్ కంట్రోలర్ కేపీస్ రాజు, ఇన్‌స్పెక్టర్ శివ బాలాజీ నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతుబజారు ఎస్టేట్ అధికారి కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పలు శాఖలపై సమీక్ష

కడియం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సమావేశంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాఖల వారీగా మండల పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. విద్యాశాఖ, విద్యుత్ శాఖల పనితీరు మెరుగుపరుచుకోవాలని ఎంపీపీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.సుజాత, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోస్ట్‌కార్డు ఉద్యమం

ప్రకాశం నగర్: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమ్మె గురువారం 17వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పోస్టుకార్డులో తమ సమస్యలు రాసి పంపించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలపై చర్చించి, సానుకూలంగా పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో నగర ప్రాజెక్టు కార్యదర్శి కె.సునీత, రామలక్ష్మి పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

కంబాలచెరువు: సెల్‌ఫోన్ ఎక్కువగా చూడొద్దని మందలించడంతో బాలుడు (14) అదృశ్యమయ్యాడు. ఈ మేరకు ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. జేఎన్ రోడ్డుకు చెందిన బాలుడు నిత్యం సెల్‌ఫోన్‌తో గడుపుతున్నాడు. దీంతో అతడిని ఆమె తల్లి మందలించింది. ఈ నేపథ్యంలో ఆ బాలుడు ఈ నెల 25న ఇంటి నుంచి వెళ్లిపోయాడు.

పీఅండ్ టీ కాలనీలో..

తన భార్య గత కొద్ది రోజులుగా కనిపించడం లేదని ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీ అండ్ టీ కాలనీకి చెందిన వివాహిత ఈనెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్యాబ్‌ల పంపిణీ

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంఈవో కె.స్వామి నాయక్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

పేదలకు మరింత మెరుగైన వైద్యం

- ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- కలెక్టర్ మాధవీలత
- లబ్ధిదారులకు కార్డుల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: అందరికీ మెరుగైన వైద్య సేవలు, ఆరోగ్య భద్రత పెంచే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షల వరకూ పెంచారని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్ 3, 4 సచివాలయం పరిధిలో ఆరోగ్యశ్రీ పథకం కార్డులను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకూ కేవలం పేద వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ఆరోగ్యశ్రీ పథకం నేడు వార్షిక ఆదాయం రూ.5 లక్షలు పొందుతున్న మధ్యతరగతి కుటుంబాలకు వర్తింపచేయడం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరికీ ఈ కార్డు అందజేయాలని, ఇందుకు వలంటీర్లు ఇంటింటా సర్వే చేస్తూ వివరాలు నమోదు చేయాలన్నారు.



ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

ప్రతి ఒక్కరి మొబైల్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం తప్పనిసరి అన్నారు. జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, ఆర్ఎంసీ హెల్త్ అధికారి డాక్టర్ వి.వినూత్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం రూరల్: జనవరిలో నిర్వహించనున్న వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలను, ఆడుదాం ఆంధ్రా, 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను పూర్తిస్థాయిలో విజయవంతంగా చేయాలని, ఇందుకోసం అన్నిశాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

క్షేత్రస్థాయి ప్రణాళికపై సూచనలు

కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన ప్రణాళికపై సూచనలు చేశారన్నారు. ఆయా ప్రభుత్వ పథకాల కింద నిర్వహించే కార్యక్రమాల కోసం ముందుగానే షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలన్నారు. నియోజకవర్గాల స్థాయిలో స్థానిక శాసన సభ్యులతో సమన్వయం చేసుకుని, ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. జనవరి ఒకటి నుంచి 8వ తేదీ వరకూ వైఎస్సార్ పెన్షన్ కానుక కింద కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి జనవరి 3న కాకినాడ జరిగే కార్యక్రమంలో పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. జనవరి 23న వైఎస్సార్ ఆసరా అమలవుతుందన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రారంభిస్తారని, వైఎస్సార్ చేయూత కింద జనవరి 27 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జనవరి ఒకటి నుంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవోలు పి.వీణాదేవి, వి.శాంతి కుమారి, డీఎస్‌డబ్ల్యూవో ఎం.సందీప్, జిల్లా స్పోర్ట్స్ అధికారి బీఎంఎం శేషగిరిరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: దేశ ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీని స్థాపించారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ 138 ఏళ్లు పూర్తి చేసుకుని, 139వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా స్థానిక కృష్ణనగర్‌లోని పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు ముళ్ల మాధవ్, ఆకుల భాగ్యసూర్యలక్ష్మి, పీసీసీ కార్యదర్శి బెజవాడ రంగారావు పాల్గొన్నారు.

చిత్రసీమలో చిరంజీవి ప్రోత్సాహం మరువలేనిది

- పుష్ప 2లో నటిస్తున్నా
- ప్రముఖ నటులు శుభోదయం సుబ్బారావు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చిత్రసీమలో మెగాస్టార్ చిరంజీవి జూనియర్ ఆర్టిస్టులను ప్రోత్సహించడం మరువలేనిదని ప్రముఖ నటుడు సుభోదయం సుబ్బారావు(రాజశేఖర్) పేర్కొన్నారు. సెయింట్ ఆన్స్ హైస్కూల్ 50వ వార్షికోత్సవాలలో పాల్గొనేందుకు రాజమహేంద్రవరం వచ్చిన ఆయన తన చిరకాల మిత్రుడు ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యంతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సినీ రంగంలో అందరూ తనను ప్రోత్సహించి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం వాసినైన తన విద్యాభ్యాసం సెయింట్ ఆన్స్ స్కూల్లో జరిగిందన్నారు. ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదివానన్నారు. చిత్రసీమలో చిరంజీవి, నాగ చైతన్య, అల్లు అర్జున్, మహేష్ బాబు తదితరులతో నటించడం ఆనందంగా ఉందన్నారు. పుష్ప – 2లో కీలక పాత్ర పోషిస్తున్నానని అన్నారు. శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సినీ పరిశ్రమలో సుబ్రహ్మణ్యం మరింత రాణించాలని ఆకాంక్షించారు. వచ్చే ఏడాది ఉగాది పర్వదినం సందర్భంగా రాజమండ్రి చెందిన కళాకారులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సన్మానిస్తామన్నారు. కార్యక్రమంలో సందీప్, సన్ని తదితరులు పాల్గొన్నారు.



సుబ్బారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం

నగర అభివృద్ధే ఎంపీ భరత్‌రామ్ ధ్యేయం

- ఆయనపై విమర్శలు చేస్తే సహించం
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు శ్రీహరి ధ్వజం

రాజమహేంద్రవరం సిటీ: నగర అభివృద్ధే ధ్యేయంగా ఎంపీ భరత్‌రామ్ నిరంతరం కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిరెడ్డి కుటుంబం మేయర్, ఎమ్మెల్సీ, ఇప్పుడు ఎమ్మెల్యే పదవిని అనుభవిస్తున్నా ఏనాడూ నగరాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నిరంతరం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎంపీ భరత్‌రామ్‌ను విమర్శించడానికి మాత్రం ఎప్పుడూ ముందుంటుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ జిక్షపై అవాకులు, చవాకులు పేలితే తగిన విధంగా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. న్యాయవ్యవస్థపై కూడా ఆదిరెడ్డి వాసు ఇష్టమొచ్చినట్టుగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. డివిజన్ల వారీగా ఎక్కడ ఏ అభివృద్ధి పనిచేశామో అన్ని వివరాలు ఉన్నాయని, వారి పాలనా కాలంలో ఎక్కడ ఏ పని చేశారో చెప్పడానికి సిద్ధంగా ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రెండు గోదావరి పుష్కరాలకు వచ్చిన నిధులన్నీ దోచుకున్నారని, గత పుష్కరాల్లో 29 మంది భక్తుల మృతికి కారణమయ్యారని ఆరోపించారు. ఈట్ స్ట్రీట్‌లో మానవ తప్పిదం వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని, దాన్ని కూడా రాజకీయం చేయడం సరికాదన్నారు. టీడీపీ, జనసేన కేవలం అధికారం పంచుకోవడానికి మాత్రమే కలిశాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ముప్పన ప్రభాకర్, కాటం రజనీకాంత్, మార్తి నాగేశ్వరరావు, రేగుళ్ల బాల శ్రీధర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అడపా శ్రీహరి

ముగిసిన సారస్వత మార్గశీర్షం అష్టావధానాలు



అష్టావధానంలో పాల్గొన్న పండితులు

ప్రకాశం నగర్: కుటుంబ జీవనంతో అవధాన ప్రక్రియ ముడిపడి ఉందని సాహిత్య రత్న బంకుపల్లె రమేశ శర్మ అన్నారు. అష్టావధానంలోని ఎనిమిది అంశాలు మన ఇళ్లల్లో కనిపిస్తుంటాయని సోదాహరణంగా వివరించారు. స్థానిక ప్రకాశం నగర్ రౌండ్ పార్క్ దగ్గర గల ధర్మంచర హాలులో నాలుగు రోజుల సారస్వత మార్గశీర్షం అష్టావధానాలలో భాగంగా చివరి రోజు గురువారం ఉభయ కళాతపస్వి, అష్టావధాని, వేద పండితుడు సునరావు చంద్రశేఖర శర్మ అష్టావధానం అద్వితీయంగా సాగింది. కమనీయ పద్య ధారణతో శ్రోతలను ఓలలాడించారు. రమేష్ శర్మ సంచాలకత్వం వహిస్తూ, సాహితీ కారులు, పద్య ప్రియులు, అవధానులు ఆనందమయ జీవితం గడుపుతారని అన్నారు. శతావధాన శరచ్చంద్ర తాతా సందీప్ శర్మ అధ్యక్షత వహిస్తూ, భాష వలన విచక్షణ వస్తుందని, అందునా మాతృభాష అయితే మరింత విచక్షణ ఉంటుందని అన్నారు. అందుకే మాతృభాష నేర్చుకోవడం ఇంటినుంచి మొదలుపెట్టాలని అన్నారు. అవధానికి పద్యకళా తపస్వి దూళిపాళ మహాదేవమణి ఆశీస్సులు అందజేశారు. కేఎస్ అన్నపూర్ణాదేవి (నిషిద్ధాక్షరి), దువ్వూరి మల్లికార్జునరావు (సమస్య), ఎం.శ్రీదేవి (దత్తపది), పి.విశాలాక్షి (వర్ణన), సవితాల అనంత శ్రీకాంత్ (వ్యస్తాక్షరి), డాక్టర్ పీవీబీ సంజీవరావు (ఆశువు), కుమారి భాను ప్రియాంక భార్గవి (ఘంటావధానం), జోరా శర్మ (అప్రస్తుత ప్రసంగం) పృచ్ఛకులుగా వ్యవహరించారు. విశ్రాంత డీఆర్వో జితేంద్ర, ఎస్పీ గంగిరెడ్డి, మండపాక మహేశ్వరి, తాతా వరప్రసాద్, వీవీ సుబ్రహ్మణ్యం, వెంపాటి విశ్వనాథం, బూడిద వీర్రాజు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- ఫరిజల్లిపేటలో 186 మందికి పట్టాల పంపిణీ

రాజానగరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలను మంజూరు చేయడంతో పాటు, ఆ స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వపరంగా రుణాలు కూడా ఇప్పిస్తామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ఫరిజల్లిపేటలో 186 మంది పేదలకు గురువారం నివాస స్థల పట్టాలను సతీమణి డాక్టర్ రాజశ్రీతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ఒక్క పేదోడికి సెంటు భూమి కూడా ఇవ్వలేదన్నారు. జగనన్న సీఎం అయిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 31.75 లక్షల మందికి నివాస స్థలాలు పంపిణీ చేసి, రికార్డు సృష్టించారన్నారు. ఆ స్థలాలలో ఇళ్లు కట్టుకునేందుకు రుణాలు కూడా మంజూరు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా స్థలాలలో కాలనీలే కాకుండా ఏకంగా గ్రామాలే ఆవిర్భవిస్తున్నాయన్నారు. పేదల జీవితాలలో వెలుగులు తీసుకురావాలనే తలంపుతో పనిచేస్తున్న జగన్ సర్కారు మరోసారి అధికారంలోకి రావాలన్నారు. అప్పుడే నవరత్నాలు వంటి సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. సర్పంచ్ ఉండమట్ల సత్యవతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, మాజీ సర్పంచ్ ఉండమట్ల రాజబాబు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, కోలపాటి వెంకన్న, ప్రగడ చక్రి, మన్యం వీర వెంకట్రావు, గొల్లపల్లి వీరబాబు, పరిమి విజయ్ పాల్గొన్నారు.



పేదలకు స్థల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు

ప్రతి ఒక్కరిపై దయ కలిగి ఉండాలి



చందన నాగేశ్వర్‌ను సత్కరిస్తున్న బెరాక చర్చి పెద్దలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): క్షమాగుణం కలిగి ఉంటే శత్రుబాధలు ఉండవని, ప్రతి ఒక్కరిపై ప్రేమ, దయ కలిగి ఉండాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక 16వ డివిజన్ అల్యూమినియం వర్కర్స్ కాలనీలోని బెరకా చర్చిలో బుధవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చందనను బెరాకా చర్చి సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, భాను చందర్ పాల్గొన్నారు.

ముగిసిన అథ్లెటిక్ శిక్షణ శిబిరం

ప్రకాశం నగర్: చెన్నైలోని స్పోర్ట్స్ యూనివర్సిటీలో జరగబోయే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల అథ్లెటిక్ చాంపియన్‌షిప్ క్రీడా పోటీలకు శిక్షణ ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎబల్ రాజబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో వివిధ కళాశాలల నుంచి క్రీడాకారులకు ఈనెల 22 నుంచి 27 వరకూ తమ కళాశాలలో శిక్షణ శిబిరం నిర్వహించామన్నారు. సీరా గంగాధర్, స్పోర్ట్స్ విభాగ అధిపతి పీపీ కిషోర్ బాబు కోచ్‌లుగా వ్యవహరించారన్నారు.

కాపవరంలో మెకానిక్ షెడ్డు దగ్ధం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరానికి చెందిన కనుబొజ్జి సూర్యచంద్రం మెకానిక్ షెడ్డు గురువారం మధ్యాహ్నం దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. సూర్యచంద్రం మెకానిక్ షెడ్డులో పనులు చేసుకుని మధ్యాహ్నం భోజనానికి ఇంటికెళ్లారు. మరో మెకానిక్ షెడ్డు బయట ఉన్నాడు. ఆ సమయంలో షెడ్డు వెనుక భాగం నుంచి మంటలు రేగాయి. గుర్తించిన స్థానికులు ఈ విషయాన్ని సూర్యచంద్రానికి ఫోన్ చేసి చెప్పారు. వెంటనే స్థానిక యువకులతో కలిసి మంటలను అదుపు చేశారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది కూడా వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే షెడ్డులోని ఆయిల్ డబ్బాలు, ఇతర సామగ్రి కాలిపోయింది. వాటి విలువ రూ.1,50,000 లు ఉంటుందని సూర్యచంద్రం తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు సాయం అందజేస్తున్న నాయకులు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధి నాగరత్నం కాలనీలో ఈనెల 25న జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన దాసరి సత్యనారాయణ, దాసరి వెంకన్న కుటుంబాలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేయూత నిచ్చారు. ఆయన పంపించిన రూ.10 వేలు, 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు, వంట సామగ్రిని గురువారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు తదితరులు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్మిరిశెట్టి వెంకటేశ్వరరావు, చిర్ల పోశియ్య, మట్ట శ్రీనువాస్, ద్వారంపూడి రామాకృష్ణ, కోలా శ్రీను, ఆర్ఎంపీ రాజు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	సలార్
సూర్యమినీ	ఆక్వామేన్
సూర్యప్యాలెస్	సలార్
స్వామి	హాయ్‌నాన్న
శివజ్యోతి	ఉమాపతి
అనుశ్రీ	డెవిల్
రాజా	సలార్
అశోక	సలార్
ఊర్వశి	డెవిల్
రంభ	బబుల్‌గమ్
మేనక	ఆక్వామేన్
అప్సర	యానిమల్
నామవరం	
వీఎస్ మహల్	సలార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	డెవిల్
కడియం	
వెంకటసూర్య	డెవిల్

సెయింట్ ఆన్స్‌లో ఉత్తమ విద్యాబోధన

- ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు
- ముగిసిన గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: నైతిక విలువలతో కూడిన విద్యాబోధన అందించే పాఠశాల సెయింట్ ఆన్స్ అని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్‌కే రామచంద్రరావు అన్నారు. బొమ్మూరులోని సెయింట్ ఆన్స్ పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు సెయింట్ ఆన్స్ సొసైటీ ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ సాంధ్రీనా అధ్యక్షతన గురువారం రాత్రి అత్యంత వైభవంగా ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామచంద్రరావు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్ తదితర అనేక రంగాల్లో ఉన్నత స్థాయిలో నిలిచారన్నారు. సెయింట్ ఆన్స్ పూర్వ విద్యార్థుల సంఘం (అలుమ్ని) కోశాధికారి కోడి ప్రవీణ్ మాట్లాడుతూ పాఠశాల, పూర్వవిద్యార్థుల సంఘం సంయుక్తంగా రూ.2 వేల కోట్లతో ఆడిటోరియం నిర్మాణం చేపడతామన్నారు. దీనికి పూర్వ విద్యార్థులంతా సహకరించాలని కోరారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ తాను, తన భర్త అనిల్ ఇదే పాఠశాలలో చదివామన్నారు. ప్రతి విద్యార్థి తమ లక్ష్యాన్ని సాధించుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి మాట్లాడుతూ తాను ఈ పాఠశాల విద్యార్థినేనని, విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు, సిస్టర్లు చేసిన కృషి మరువలేనిదన్నారు. కోల్‌కతా ఈస్ట్రన్ కమాండెంట్ కేవీ నాగిరెడ్డి, పూర్వ విద్యార్థి, పూర్వ ఉపాధ్యాయిని, న్యూజిలాండ్‌లో ఉంటున్న సుమరంజని ఆన్‌లైన్ ద్వారా తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నటుడు సుభోదయం సుబ్బారావు, మాజీ కార్పొరేటర్లు రాయుడు రాజవల్లి, బెజవాడ రాజ్‌కుమార్, డాక్టర్ వాకా కృష్ణశ్రీ, అలుమ్ని కార్యదర్శి జాన్సన్ సీహెచ్, డాక్టర్ టి.పద్మజ, కేదార్, ఎం.శ్రీనివాస్ పూర్వవిద్యార్థులు కలిసి అప్పటి విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



విశ్రాంత ఉపాధ్యాయులతో సెయింట్ ఆన్స్ పూర్వ విద్యార్థులు

సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల ముగింపులో బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. సెయింట్ ఆన్స్ కరస్పాండెంట్ సిస్టర్ షీనా, ప్రిన్సిపాల్ ఝాన్సీ మాట్లాడుతూ తమ పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను విజయవంతం చేసిన పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ సొసైటీ అసిస్టెంట్ సుపీరియర్ సిస్టర్ ఆన్‌మేరీగోవు, సుపీరియర్ ఫాదర్ బవిరి సురేష్ బాబు పాల్గొన్నారు.



కార్యక్రమానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సందడి

సెయింట్ ఆన్స్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, అప్పటి నిక్‌నేమ్‌లతో ఆప్యాయంగా పిలుచుకున్నారు. అప్పుడు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను కలిసి తమ సంతోషాన్ని పంచుకోవడంతో పాటు వారి ఆశీసులు అందుకున్నారు. నటుడు సుభోదయం సుబ్బారావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 1990–91బ్యాచ్‌కు చెందిన ఆయనతో స్నేహితులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సెల్ఫీలు దిగారు.